ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 12-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- భారతీయ ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు.
- దేశం ముందు వికసిత్ భారత్-2047 అతి పెద్ద లక్ష్యంగా ఉందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ అన్నారు.
- భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే శక్తి యువతకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమమైన మహా కుంభమేళా-2025 ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్‌లో రేపు ప్రారంభం కానుంది.
- అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారతదేశం తరఫున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ హాజరవుతారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గొప్ప ఆధ్యాత్మిక నాయకుడు, తత్వవేత్త, ఆలోచనాపరుడు స్వామి వివేకానంద జయంతిని ఈరోజు జాతీయ యువజనోత్సవంగా దేశమంతా జరుపుకుంటున్నారు. జనవరి 12వ తేదీన ఈ దినోత్సవాన్ని యువతకు స్ఫూర్తిగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయనకు ఘన నివాళులర్పించారు. స్వామి వివేకానంద దేశంలో గొప్ప ఆధ్యాత్మిక సందేశాన్ని పాశ్చాత్య ప్రపంచానికి తీసుకెళ్లారని, భారతదేశంలోని ప్రజలలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు. యువత శక్తి సామర్థ్యాన్ని దేశ నిర్మాణానికి వినియోగించేలా ఆయన ప్రేరేపించారని ఆమె చెప్పారు. స్వామి వివేకానంద వారసత్వం కొనసాగాలని, ప్రపంచవ్యాప్తంగా అసంఖ్యాక ప్రజలకు స్ఫూర్తినివ్వాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశం ముందు వికసిత్ భారత్-2047 అతి పెద్ద లక్ష్యంగా ఉందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ అన్నారు. సరైన ప్రణాళికతో దేశం ఈ లక్ష్యాన్ని సాధిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. గుర్గావ్‌లో ఈ రోజు జరిగిన మాస్టర్స్ యూనియన్ 4వ స్నాతకోత్సవ వేడుకలలో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటికే దేశం ప్రపంచంలో అయిదవ ఆర్థిక వ్యవస్థగా ఉందని గుర్తు చేశారు. రానున్న కాలంలో మూడవ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ఉప రాష్ట్రపతి పేర్కొంటూ..

(వాయిస్ బైట్.. 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమమైన మహా కుంభమేళా-2025 ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్‌లో రేపు ప్రారంభం కానుంది. పుష్య పూర్ణిమ నాడు భక్తులు చేసే మొదటి అమృత స్నానంతో మహా కుంభ మేళా అద్భుత ఆధ్యాత్మిక ఘట్టం మొదలవుతుంది. ఫిబ్రవరి 26 వరకు జరిగే ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుండి నలభై అయిదు కోట్ల మంది దాకా భక్తులు, యాత్రికులు, సందర్శకులు హాజరవుతారని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా

ఉండగా, మహా కుంభమేళా కోసం మహాకుంభ్ నగరానికి భక్తులు పెద్ద సంఖ్యలో ఇప్పటికే చేరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసింది. ఆలయాలు, కీలక ప్రదేశాలలో అధికారులు భద్రతా చర్యలను పటిష్టం చేశారు. ఈ ఆధ్యాత్మిక వేడుక కోసం ఏడు అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. భారతీయ రైల్వే 3 వేల 300 ప్రత్యేక రైళ్లతో సహా 10 వేలకు పైగా రైళ్లను నడుపుతోంది. మౌలిక సదుపాయాల కల్పన, భద్రత, పరిశుభ్రత, ఆరోగ్యం, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా తదితరాలపై ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే శక్తి యువతకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. కొత్త తరంపైన ప్రగాఢమైన విశ్వాసం ఉందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ రోజు జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2025లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతదేశ యువశక్తి అద్భుతమైన మార్పులకు దారితీస్తోందన్నారు. యువత అన్ని సమస్యలకు పరిష్కారాలను కనుగొంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దేశం ప్రతిష్టాత్మక లక్ష్యాలను సాధించాలంటే కోట్లాది ప్రజల భాగస్వామ్యం అవసరమని నరేంద్ర మోడీ పేర్కొంటూ...

(వాయిస్ బైట్..39 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత దేశం తరఫున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ హాజరవుతారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 20న అమెరికా 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. జైశంకర్ అమెరికా పర్యటన సమయంలో ఆ దేశ పరిపాలన ప్రతినిధులతో కూడా సమావేశమవుతారని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని వివిధ ప్రాంతాలలో జరుపుకునే మకర సంక్రాంతి, పొంగల్ మాగ్, బిహు పండుగల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగలు భారతదేశ సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలుగా ఆమె అభివర్ణించారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో విభిన్న రూపాలలో జరుపుకునే ఈ పండుగలు ప్రకృతితో ప్రజలకు ఉన్న సామరస్య సంబంధాన్ని తెలియచేస్తాయని అన్నారు. పంటలతో ముడిపడి ఉన్న ఈ పండుగల ద్వారా జాతిని పోషించడానికి అవిశ్రాంతంగా శ్రమించే రైతులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లుగా రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ మార్చి 23 నుంచి ప్రారంభం కానుందని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా ప్రకటించారు. బీసీసీఐ ప్రత్యేక సాధారణ సమావేశం ముంబయిలో ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా రాజీవ్ శుక్లా పాత్రికేయులతో మాట్లాడుతూ, ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 23 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. అదే విధంగా మే 25న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని వెల్లడించారు. కాగా పూర్తి స్థాయి షెడ్యూల్‌ను మరికొద్ది రోజులలో విడుదల చేస్తామని ఆయన చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో స్పాడెక్స్ మిషన్‌లో భాగంగా తొలిసారిగా స్పేస్ డాకింగ్ మిషన్‌ను నిర్వహించనున్నది. ఇందుకోసం నింగిలోకి పంపిన రెండు ఉపగ్రహాలను ఈరోజు మూడు మీటర్ల దగ్గరగా తీసుకువచ్చింది. ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలను డాకింగ్ ప్రక్రియ కోసం దగ్గరగా తీసుకువచ్చినట్లుగా ఇస్రో పేర్కొంది. ఈ రెండు ఉపగ్రహాలు ఫొటోలు, వీడియోలను రికార్డ్ చేసి పంపాయి. రెండు ఉపగ్రహాలను మొదట 15 మీటర్లకు ఆ తర్వాత మూడు మీటర్లకు ఇస్రో తీసుకువచ్చింది. డేటాను మరింత విశ్లేషించిన తర్వాత డాకింగ్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం డాకింగ్‌కు కేవలం 50 అడుగులు దూరంలో ఉన్నామని ఇస్రో పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లో ద్విచక్ర వాహన ప్రమాదాలను తగ్గించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని అధికార వర్గాలు తెలిపాయి. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు ఇంధనం విక్రయించవద్దని పెట్రోల్ బంకుల ఆపరేటర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. హెల్మెట్ లేకపోతే ఇంధనం లేదు, అనే కొత్త విధానాన్ని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ బ్రజేష్ నారాయణ్ సింగ్ ప్రకటించారు. ఈ విధానాన్ని అమలు చేయడం అత్యవసరమైందని రవాణా శాఖ ఆధికారులు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మధ్యప్రదేశ్ భోపాల్‌లోని శౌర్య స్మారక్‌లో ప్రత్యేకమైన రంగోలి తయారు చేశారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద 3డి రంగోలి అని ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. స్వామి వివేకానంద చిత్రంగా రూపొందించిన ఈ రంగోలి 18 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తయారు చేయబడిందని అధికారులు పేర్కొన్నారు. కాగా, దీని తయారీకి 4 వేల కిలోల రంగులను ఉపయోగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =